ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

గురువారం 11 సెప్టెంబరు 2025

బీఆర్ఏయూ రిజిస్ట్రార్‌గా అడ్డయ్య

ఎచ్చెర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ బి.అడ్డయ్య నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఆంధ్రా యూనివర్సిటీ (విశాఖపట్నం)కి అనుబంధంగా ఉన్న బీఆర్ఏయూ పీజీ సెంటర్‌లో అర్థశాస్త్రం విభాగంలో అడ్డయ్య తొలుత అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. ఆ తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం వర్సిటీలో రెక్టార్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు వర్సిటీ రిజిస్ట్రార్‌గా బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ పి.సుజాత వ్యవహరించారు.

సైబర్ సెల్ స్వాహా!



- జిల్లాలో పెరుగుతున్న మోసాలు
- మెసేజ్‌ల రూపంలో ఫోన్లకు లింకులు
- వాటిని క్లిక్ చేస్తే నగదు మాయం
- ఫిర్యాదు చేస్తున్నది కొంతమందే
- చదువుకున్న వారూ బాధితులే
- నెలలు గడుస్తున్నా తేలని కేసులు
- దర్యాప్తులో తీవ్ర జాప్యంపై విమర్శలు
- ఎస్పీ ఆదేశించినా పురోగతి లేదు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లకు ఏమాత్రం అవకాశం దొరికినా ఖాతాలను ఖాళీ చేసేస్తున్నారు. ఇందులో సామాన్యులే ఎక్కువగా బాధితులుగా మిగులుతున్నారు. ఇటీవల స్మార్ట్‌ఫోన్ల వినియోగం అధికమైంది. వీటిని ఆసరాగా చేసుకొని నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. బ్యాంక్ ఖాతాల నుంచి నగదు దారి మళ్లించడం.. ఏటీఎం కార్డులను ఏమార్చడం, ఫేస్‌బుక్, వాట్సాప్ మెసెంజర్ హ్యాకింగ్, ఆన్‌లైన్ షాపింగ్, ఫేక్ వెబ్‌సైట్స్, మెసేజ్ లింక్స్ యాప్స్ వినియోగం తదితర రూపంలో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. నగదును (మిగతా 6వ పేజీలో..)



ఎస్పీ స్వయంగా ఆదేశించినా..

- ఓ ఉద్యోగి పేరిట అపరిచిత వ్యక్తులు ఓ ప్రైవేటు యాప్ ద్వారా రూ.10వేలు రుణం తీసుకున్నారు. అయితే అకౌంట్ చెక్ చేయగా ఎలాంటి డబ్బులు జమ కాలేదు. దీనిపై శ్రీకాకుళం సైబర్ పోలీసులకు పది నెలల క్రితం ఫిర్యాదు చేశారు. వారు పట్టించుకోకపోవడంతో ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ కూడా వారిని పిలిపించి రెండు సార్లు మాట్లాడారు. ఆ కేసును తేల్చాలని ఆదేశించారు. అయినా ఇప్పటికీ ఆ కేసు పురోగతి లేదు. అసలు ఆ కేసు ఏమైందో కూడా తెలియదు.

- గత ఏడాది సెప్టెంబరు 5న పలాసకు చెందిన ఒక ఉపాధ్యాయుడికి ఓ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. మీ కుమా రుడు డ్రగ్స్‌తో పట్టుబడ్డాడని, ఆయన్ను విడి పించాలంటే డబ్బులు మా బ్యాంకు ఖాతాలో జ మ చేయాలని హిందీలో మాట్లాడారు. ఆ ఉపా ధ్యాయులు ఆందోళన చెంది విడతల వారీగా రూ.1.90లక్షలు అపరిచిత వ్యక్తి చెప్పిన బ్యాంకు ఖాతా లో జమ చేశాడు. తర్వాత దూర ప్రాంతంలో చదువు తున్న కుమారుడికి ఫోన్ చేయగా క్షేమంగా ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో తాను సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడినట్టు ఆ ఉపాధ్యాయుడు గ్రహించాడు. దీంతో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

- గత ఏడాది జూన్‌లో శ్రీకాకుళం గుడివీధికి చెందిన ఓ యువకుడు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయాడు. విశాఖలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఆ యువకుడికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. మీకు కొరియర్ వచ్చిందని, అది చట్ట విరుద్ధమని, ముంబాయిలో కేసు నమోదైందని సైబర్ నేరగాళ్లు హెచ్చరించారు. మీరు ప్రభుత్వ అధికారులకు సహకరించాలని బెదిరించారు. దీంతో ఆ యువకుడు భయపడి వారు సూచించిన బ్యాంకు అకౌంట్‌లో రూ.4 లక్షలకు పైగా జమ చేశాడు. చివరకు తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

- రెండు నెలల కిందట రాగోలు జెమ్స్ కళాశాలలో పనిచేస్తున్న ఓ మహిళా డాక్టర్‌కు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. మీ ఆధార్‌కార్డు హ్యూమన్ ట్రాఫికింగ్‌తో లింక్ అయిందని, వారి డబ్బులు మీ అకౌంట్లలో జమ అవుతున్నాయని, మీపై సీబీఐ అధికారులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారని బెదిరించారు. ఆమె వద్ద నుంచి పలుమార్లు రూ.13.50లక్షలు వసూలు చేశారు. చివరకు మోసపోయానని తెలుసుకున్న ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులు మైసూర్, కోజికోడ్‌లో ఉన్నారని తెలుసుకొని అక్కడకు వెళ్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.6 లక్షలు రికవరీ చేశారు.

ఆ భూములు స్వాహా



కంబిరిగాం రోడ్డులో ఇనాంభూములు



- కంబిరిగాం భూముల్లో చీకటి కోణం
- చేతులు మారుతున్న ఇనాం భూములు
- వైసీపీ హయాంలో చక్రం తిప్పిన సీఎంవో పెద్దలు
- వారికి అప్పనంగా 15 ఎకరాలు సమర్పించిన వైనం
- వాటి విలువ ప్రస్తుతం రూ.45 కోట్ల పైమాటే
- అసలైన రైతులకు దక్కని ఫలాలు

- ఈ వృద్ధురాలి పేరు రుంకు సీతారత్నం. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పద్మనాభపురం శివాజీనగర్‌కాలనీ కాలనీలో చిన్న గదిలో నివాసం ఉంటుంది. ఈమె భర్త రామయ్య పలాస మండలం కంబిరిగాం గ్రామ తలయారీగా పనిచేసేవాడు. ఈయనకు కంబిరిగాంలో 2.22 ఎకరాల భూమి ఉండేది. సర్వేనెంబరు 33/1లో సుమారు 40 సెంట్ల స్థలంలో ఓ చిన్న ఇల్లు కట్టుకొని వారి తాతల కాలం నుంచి అంటే 80 ఏళ్లగా అక్కడే నివాసం ఉండేవారు. రామయ్య మరణానంతరం ఆ భూమి భార్య సీతారత్నంకు వచ్చింది. అయితే, కోర్టు ఆదేశాల మేరకు ఇనాందారులుగా ఉన్న కంబిరిగాం భూస్వాములు, రైతుల మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో సీతారత్నం ఆధీనంలో ఉన్న మొత్తం 2.22 ఎకరాల విస్తీర్ణం భూమి ఆమెకు దక్కాల్సి ఉంది. కానీ, కేవలం 70సెంట్లు మాత్రమే వచ్చింది. వారు నివాసం ఉంటున్న ఇంటి ప్రాంతాన్ని సైతం కూల్చివేసి ఇనాం భూముల్లో ఉన్న వాటిని సైతం విక్రయించేశారు. దీంతో సీతారత్నంతో పాటు ఆమె కుటుంబ సభ్యులు పలాస వచ్చేశారు. ఆర్డీవో కోర్టులో భూ హక్కులు, గృహ హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు.

పలాస, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

ఇది ఒక్క సీతారత్నం సమస్య కాదు. కంబిరిగాం గ్రామంలో ఉన్న మొత్తం 122 మంది రైతుల సమస్య. పలాస మండలం కంబిరిగాంలో సర్వేనెంబరు 51, 53లో 254 ఎకరాల భూమి ఉంది. వాస్తవానికి ఈ భూముల్లో ఇనాందారులు ఉన్నప్పటికీ రైతుల సాగులోనే భూమంతా ఉంది. 2016లో కోర్టు తీర్పు ప్రకారం రైతులు, ఇనాందారుల మధ్య భూ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం 122 మంది రైతులకు 129.76 ఎకరాలు, ఇనాందారులకు 124.24 ఎకరాలు రావాల్సి ఉంది. ఆ విధంగానే ప్రభుత్వ రికార్డులు పొందుపరచడంతో పాటు కోర్టులో కూడా సంబంధిత రైతు వివరాలు స్పష్టంగా రాసి ఉన్నాయి. అప్పటి జిల్లా కలెక్టర్ కూడా రికార్డు మేరకే భూ పంపిణీ జరగాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అంతా సవ్యంగా జరిగి ఉంటే ఎటువంటి (మిగతా 6వ పేజీలో..)

అమెజాన్ ఏజెన్సీ ఇప్పిస్తానని చెప్పి..

- ఫేక్ ఐడీ ద్వారా నగదు స్వాహా
- మోసపోయినట్టు గుర్తించి పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

8లో

ఓదార్పే మిగిలింది

- ఎలాంటి పరిహారం అందలేదు
- నాలుగు నెలలుగా ఎదురుచూపు
- ఇదీ సామంతపుట్టుగ విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబాల పరిస్థితి
- ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

కంచిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వారివి నిరుపేద కుటుంబాలు. గ్రామ దేవత సంబరాల సమయంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో తమ వారిని కోల్పోయారు. ఆ సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి ఆ కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూసామని హామీ ఇచ్చారు. కానీ, నాలుగు నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా వారికి అందలేదు. ఓదార్పు తప్ప తమకు పరిహారం అందలేదని ఆ కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి. తలతంపర పంచాయతీ సామంతపుట్టుగ (చిల్లాపుట్టుగ)లో ఈ ఏడాది మే 26న జరిగిన గ్రామ దేవత సంబరాల్లో విద్యుత్ ప్రమాదం సంభవించి చిల్లా ఈశ్వరరావు (28), బహడపల్లి నందిని (12), నొళియా కృష్ణ (3) అక్కడికక్కడే మృతి చెందారు. అదే గ్రామానికే చెందిన పొడియా మనోజ్ అనే రెండేళ్ల బాలుడితోపాటు జన్ని కుమారి, చిల్లా తరిణి అనే మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధిత కుటుంబాలను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పరామర్శించి, ఆదుకుంటామని హామీలైతే ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఆ దిశగా ఎటువంటి ఫలితం కనిపించలేదు. ఈ ప్రమాదంలో తమ కుమారుడు ఈశ్వరరావును కోల్పోయిన తల్లి దండ్రులు కామాక్షి, మధు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. 'గ్రామ దేవత సంబరాలు పూర్తయిన వెంటనే ముహూర్తాలు తీసి మా కుమారుడికి పెళ్లి చేద్దామని అనుకున్నాం. పిల్లను కూడా ఖాయం చేసుకున్నాం. రెక్కల కష్టంతో సంపాదించిన సొమ్ముతో పాటు కొంత అప్పు చేసి ఇల్లు కూడా కట్టాడు. సంబరాలకు వచ్చిన మేనల్లుడు నొళియా కృష్ణను విద్యుత్ ప్రమాదం నుంచి కాపాడేందుకు ప్రయత్నించాడు. మా బిడ్డత పాటు కృష్ణ కూడా మృతి చెందాడు. ప్రమాదం తరువాత అందరూ వచ్చి, సానుభూతి తెలిపారు. ఆదుకుంటామన్నారు కానీ ఇంతవరకు ఎటువంటి సాయం అందలేదు. చేతికి అందివచ్చిన కొడుకు, చివరి దశలో తోడు అవుతాడనుకుంటే ప్రమాద రూపంలో మృత్యువుకు బలయ్యాడు. ఇప్పుడు ఈ దశలో మాకు ఆసరా ఎవరంటూ' కన్నీళ్లపర్యంతమయ్యారు. ప్రభుత్వం ఆదుకుంటే మా జీవితాలు సాఫీగా సాగుతాయని, కానీ ఎవరిని వెళ్లి అడగాలో తెలియక, ఎదురుచూపులు చూస్తున్నామని వాపోతున్నారు. ఇదే ప్రమాదంలో మృతి చెందిన కంచిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని బాహడపల్లి నందిని తల్లి రాజేశ్వరి మాట్లాడు తూ.. 'కుమార్తె మృతిని ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నాం. సంబరాల కోసం అమ్మమ్మ ఇంటికి వెళ్లిన మా కుమార్తె అందని లోకాలకు వెళ్లిపోయింది. ప్రమాదం జరిగిన తరువాత అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు వచ్చి ఓదార్పు మాటలు చెప్పారు. కానీ ఎటువంటి సాయం అందించలేదు. నా భర్త దీనబంధు కుటుంబ పోషణ కోసం బయట ప్రాంతాలకు వెళ్లిపోయాడు. నేను తల్లితో కలిసి గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకోవాలి.'అని వేడుకుంటోంది.



ప్రభుత్వ సాయం అందలేదంటున్న ఈశ్వరరావు తల్లిదండ్రులు కామాక్షి, మధు



ఎవరూ పట్టించుకోవడం లేదంటున్న నందిని తల్లి రాజేశ్వరి



ఈశ్వరరావు, కృష్ణల మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు(ఫైల్)

కఠ్మాండూలో మనోళ్లు

- మానస సరోవరం యాత్రకు వెళ్లి చిక్కుకున్న 17మంది జిల్లా వాసులు
- కంట్రోల్ రూమ్‌కు అందిన సమాచారం
- తక్షణ సహాయక చర్యలు ప్రారంభించిన ప్రభుత్వం
- కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ నెంబర్ 9491222122 ఏర్పాటు

శ్రీకాకుళం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : నేపాల్ రాజధాని కఠ్మాండూలో జిల్లా వాసులు చిక్కుకున్నారు. జిల్లా నుంచి మానస సరోవ రం యాత్రకు వెళ్లిన 17 మంది పర్యాటకులు కఠ్మాండులో చిక్కుకుపోయినట్లు కలెక్టరేట్ సమాచార కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు బుధవారం రాత్రి సమాచారం అందింది. దీంతో వారిని క్షేమంగా జిల్లాకు తీసుకువచ్చేందుకు ప్రభు త్వం చర్యలు చేపడుతోంది. కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర విద్యామంత్రి నారా లోకేశ్, వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.. కఠ్మాం డూలో చిక్కుకున్న వారితో ఫోన్‌లో మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు వచ్చిన ఫోన్ కాల్స్ ఆధారంగా జిల్లా నుంచి 17 మంది నేపాల్‌కు వెళ్లినట్లు తెలిసిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

కలెక్టరేట్‌లో అత్యవసర హెల్ప్‌లైన్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేపాల్ బాధితులకు సహాయం అందించేందుకు కలెక్టర్ కార్యాలయంలో అత్యవసర హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన సమాచారం, లేదా సహాయం కోసం ప్రజలు 9491222122 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఈ హెల్ప్‌లైన్‌ను పర్యవేక్షించేందుకు ముగ్గురు ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక బృందాన్ని నియమించామన్నారు. హెల్ప్‌లైన్‌కు వచ్చే ప్రతీ కాల్‌ను ఈ బృందం స్వీకరించి, అవసరమైన వివరాలను నమోదు చేసుకుంటుందన్నారు. సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి, ఢిల్లీలోని ఏపీ భవన్‌కు తెలియజేసి, సహాయ చర్యల వేగవంతానికి కృషి చేస్తుందని తెలిపారు.

కొత్తమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కోటబొమ్మాళి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, అధికారులు, ప్రజల సహకారంతో కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం సాయంత్రం టెక్కలి ఆర్డీవో ఎన్. కృష్ణమూర్తితో కలిసి కొత్తమ్మతల్లి జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు. హెలికాప్టర్ టూరిజం కోసం స్థానిక వంశధార విద్యాసంస్థల పక్కన ఉన్న ఖాళీస్థలం, జాతీయ రహదారి కొత్తపేట వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉన్న ఖాళీ స్థలాలను చూశారు. అంతకుముందు కొత్తమ్మతల్లిని కలెక్టర్, ఆర్డీవో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, తహసీల్దార్ అప్పలరాజు, ఆలయ కార్యనిర్వహణ అధికారి వాకచర్ల రాధాకృష్ణ, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ చిన్నగోవింద్, టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, గ్రామ పెద్దలు కోరాడ పెద్ద గోవింద్, లోపింటి రఘురామరెడ్డి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తమ్మతల్లిని దర్శించుకుంటున్న కలెక్టర్

ఎరువులపై రైతులు ఆందోళన చెందవద్దు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎరువులపై రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమంలో రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాతపట్నం మండలం, తిడిమి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, జి.సిగడాం మండలం బాతువకు చెందిన బి.సూర్యనారాయణ, ఎచ్చెర్ల మండలం అల్లినగరానికి చెందిన మురళీధర్ బాబా, కొత్తూరు మండలం శోభనాపురానికి చెందిన బి.శ్రీనివాసరావు, కోటబొమ్మాళి మండలం దంతకు చెందిన పి.రమణమూర్తి, సరుబుజ్జిలి మండలం కొత్తకోటకు చెందిన కె.గురునాయుడు తదితరులు ఎరువుల విషయమై ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ తక్షణమే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల్లో ఆత్మస్థైర్యం నింపాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్త్రీశక్తిపై నేడు 'డయల్ యువర్ ఆర్ఎం'

అరసవల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకాన్ని మరింత సమర్థవంతంగా, సౌకర్యవంతంగా నిర్వహించేందుకు గాను డయల్ యువర్ ఆర్ఎం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా పరిధిలోని నాలుగు డిపోల నుంచి ప్రజలు నేరుగా తమ సూచనలు, సలహాలను ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమకు ఎదురవుతున్న సమస్యలు, పథకంలో చేయాల్సిన మార్పులు ఏమైనా ఉంటే అధికారులకు తెలపాలని కోరారు. తమ సూచనలను 9959225603 నెంబర్‌కు తెలియజేయాలని అన్నారు.

సృష్టి ఫెర్టిలిటీ కేసులో అరెస్టయిన వైద్యురాలి సస్పెన్షన్

శ్రీకాకుళం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో అరెస్టయిన జిల్లాకు చెందిన వైద్యురాలిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ కేసును తెలంగాణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కాలేజీకి చెందిన అనస్తీషియా విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ వి.రవి, అదే కళాశాలకు చెందిన ప్రసూతి స్త్రీ వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఉషాదేవి, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల శిశురోగ వైద్య నిపుణురాలు ఎ.విద్యుల్లత పేర్లు వెలుగులోకి వచ్చాయి. ఈ మేరకు డాక్టర్ విద్యుల్లతను పోలీసులు గత నెల 5న అరెస్టు చేశారు. అదే నెల 7న ఆమెకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం విద్యుల్లతను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఉరిమే ఉత్సాహం.. సభలో ఉల్లాసం.. స్త్రీ శక్తి..!



సూపర్ హిట్

చంద్రన్న ప్రభుత్వానికి జై కొట్టిన జనం



కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



మూడు జెండాలు.. మురిపించిన నేతలు





పవనిజం..

యువతరం ఉత్సాహం..

విద్యాభివృద్ధికి మరో అడుగు

- మండల కమిటీలు ఏర్పాటు
- రికార్డులు, పనితీరు పరిశీలన
- విద్యార్థుల సామర్థ్యాలు అంచనా

గుజరాతీపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఇవ్వడం వంటి చర్యలు చేపట్టింది. కొత్తగా ప్రవేశపెట్టిన విద్యావిధానంలో భాగంగా మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తోంది. ఈ కమిటీలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరును, విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించి... ఉన్నతాధికారులకు నివేదిస్తాయి. ఆ నివేదికల ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు చేపడుతుంది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తోంది.

కమిటీలో సభ్యులు ఎవరంటే..

మండల కమిటీల్లో మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈవో), నాలుగు కాంప్లెక్స్‌ల క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, హైస్కూల్ సబ్జెక్టు నిపుణులైన ఉపాధ్యాయులు ఏడుగురు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఐదుగురు సభ్యులుగా ఉంటారు. వీరందరూ వారానికి రెండుసార్లు మండలంలోని పాఠశాలలను పరిశీలిస్తారు.

ఎవరెవరు ఎలా అంటే..

ఎం.ఇ.ఒ., కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఇద్దరు, హైస్కూల్ సబ్జెక్టు టీచర్లు ఉన్నత పాఠశాలలను పరిశీలిస్తారు. మరో ఎంఈవో, ఇద్దరు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, ఐదుగురు ప్రాథమిక ఉపాధ్యాయులు స్థానిక మోడల్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలిస్తారు. ఈ పరిశీలనకు ముందు రోజు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో సమాచారాన్ని అందజేస్తారు. ఆ రోజు పాఠశాలలో ఎవరూ సెలవు పెట్టడానికి అవకాశం ఉండదు. అందరూ తప్పనిసరిగా పాఠశాలలకు హాజరు కావలసి ఉంటుంది.



ఏమేం పరిశీలిస్తారంటే..

- ఈ పరిశీలన సమయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రికార్డులను ముందుగానే సిద్ధం చేసుకోవలసి ఉంటుంది.
- విద్యార్థి, ఉపాధ్యాయుల హాజరు సమయం, సిలబస్ జరిగిన తీరును పరిశీలిస్తారు.
- పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్ దిద్దిన తీరు..
- ప్రతి శనివారం నో బ్యాగ్ డే అమలు తీరు, అకడమిక్ క్యాలెండర్లలో సూచించిన విధంగా కృత్యముల పుస్తకం ఉందో లేదో చూస్తారు.
- అభ్యసన ఫలితాలను ఎంతవరకు అందుకున్నారో చూస్తారు.
- అసెస్మెంట్ బుక్స్ పరిశీలన, ఆన్‌లైన్‌లో నమోదు తీరును పరిశీలిస్తారు.
- ఎన్‌రోల్‌మెంట్ పెంచడంపై చేసిన కృషి
- ఎంతమందికి అపార్ ఐడీ అందింది? ఎందరికి కాలేదు?
- విద్యార్థులు పాఠశాలలకు హాజరు కాకపోవడానికి కారణాలపై ఆరా
- హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు పరిశీలన
- మధ్యాహ్న భోజనం అమలు తీరు
- పాఠశాలకు సంబంధించిన అన్ని రిజిస్టర్లు, రికార్డులు
- యూనిఫామ్, బెల్ట్, షూ విద్యార్థులు అందరూ ధరించారా? లేదా చూస్తారు.
- నిబంధనల ప్రకారం పాఠశాల నిధులు వినియోగమవుతున్నాయా లేదా ఆరా.
- ప్రతి తరగతి నుంచి విద్యార్థులు ఏఏ స్థాయిల్లో ఉన్నారో గుర్తించి విజిటింగ్ రిజిస్టర్లలో రాయడం.
- ఫార్మేటివ్ వన్ అసెస్మెంట్ మార్కుల నమోదు తదితర అంశాలు పరిశీలిస్తారు.

సిక్కోలులో ఉత్సాహంగా క్రీడా పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పీఎస్ఎన్ఎం హైస్కూల్ మైదానంలో నగర పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు బుధవారం స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, చదరంగం, అథ్లెటిక్స్ ఎంపికలను నిర్వహించారు. సుమారు 20 పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు డివిజన్ పరిధి ఎంపికలకు అర్హులవుతారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ దేవదత్తానందం, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.మాధవరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ప్రత్యేక సలహాదారు పి.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి

- మహిళల అదృశ్యంపై దృష్టి సారించాలి
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ స్థాయిలో రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న కేసులను ముందస్తుగా గుర్తించాలన్నారు. కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, క్రిమినల్, ట్రాఫిక్ కేసులు, ఇతర కాంపౌండ్ కేసులను ముందుగా గుర్తించాలని సూచించారు. ఈ కేసులకు సంబంధించి ఇరువర్గాలను సంప్రదించి రాజీ అయ్యేలా చూడాలన్నారు. గత రెండేళ్లలో నమోదైన మహిళల అదృశ్యం కేసులపై దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. నాన్ బెయిల్‌బుల్ వారెంట్స్ అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, డి.లక్ష్మణరావు, ఎస్బీ సీఐ ఇమ్మానుయేల్ రాజు, డీఎస్ఆర్బీ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కంచిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగులో ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవాలని... దీనివల్ల పంట పెట్టుబడి వ్యయం తగ్గడమే కాకుండా... పంటలకు చీడపీడలు దరిచేరవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండలంలోని గోకర్ణపురం రైతు సేవా కేంద్రాన్ని స్థానిక అధికారులతో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. గోకర్ణపురం, శాసనాం గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. సాగులో ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రశ్నించారు. అధిక శాతం మంది రైతులు అందుతున్నాయని చెప్పడంతో ఎరువుల వినియోగంపై విచక్షణతో వ్యవహరించాలని సూచించారు. జీరో ఎక్సెంట్ భూముల సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దేవదాయ శాఖ భూములకు, నాన్ వెబ్‌ల్యాండ్ భూములకు ఎరువులు అందించాలని అధికారులను ఆదేశించారు. మండలానికి 20 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

అధికారుల తీరుపై ఆగ్రహం..

సాగు విస్తీర్ణంపై రైతులు చెప్పిన దానికి... అధికారుల వివరాలకు పొంతన లేకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. సరైన సమాచారం లేకుండా ఏం సేవలు అందిస్తున్నారంటూ నిలదీశారు. విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కింది స్థాయి అధికారులతో పాటు ఏవో, తహసీల్దార్లకు నోటీసులు ఇస్తామన్నారు. సరైన కారణాలు చెప్పలేని పక్షంలో సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. శాసనాం, గోకర్ణపురం గ్రామాల వద్ద ఉన్న కాలువలపై కొత్త కల్వర్టులు నిర్మించాలని రైతులు కోరారు. మండల ప్రత్యేకాధికారి అప్పలస్వామి, తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఏడీఏ భవానీ శంకర్, ఏవో కొంక్యాన సురేష్, సర్పంచ్‌లు యారాడి ఆనందరావు, వేణు, తదితరులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన కొల్లాన లోకేశ్వరరావు రెండేళ్లుగా అనారోగ్యంతో నడవలేని స్థితికి చేరుకున్నానని కలెక్టర్‌కు తెలిపారు. పింఛను మంజూరు చేసి తన కుటుంబాన్ని ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఇదిలాఉండగా... స్థానిక గ్రామ వ్యవసాయ సహాయకుడు (వీఏఏ) డి.అన్వేష్ బాబును సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.



అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాఠశాల పరిశీలన..

గోకర్ణపురంలోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ బోధన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరు గురించి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో పాటు ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో శ్రీకాకుళం జట్టు విజయం

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ విజయనగరంలో నిర్వహిస్తున్న అండర్-13 లీగ్ క్రికెట్ పోటీల్లో విజయనగరం జట్టుపై శ్రీకాకుళం జట్టు ఘన విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు పెద్దగా రాణించలేదు. రెండో ఇన్నింగ్స్‌లో సమీర్ అబ్దుల్ 112 పరుగులు చేశాడు. రెండు ఇన్నింగ్స్‌లలో జిల్లా బౌలర్ డీవీఎస్ శ్రీరామ్ పది వికెట్లు సాధించడంతో శ్రీకాకుళం జట్టు విజయం సునాయాసమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయనగరం జట్టు మొదటి ఇన్నింగ్‌లో 249 పరుగులకు అవుట్ కాగా, శ్రీకాకుళం జట్టు 148 పరుగులు మాత్రమే చేసింది. విజయనగరం రెండో ఇన్నింగ్‌లో 164 పరుగులు చేయగా.. శ్రీకాకుళం జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసి విజయం సాధించింది.

సంస్కృతం స్వల్పకాలిక కోర్సులో ప్రవేశాలు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో సంస్కృతంలో 6 నెలల స్వల్పకాలిక కోర్సులో ప్రవేశానికి ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఈ కోర్సులో ప్రవేశానికి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, ఎటువంటి ఫీజు ఉండదన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత నామమాత్రపు పరీక్ష ఫీజును చెల్లించాలన్నారు. కోర్సుకు సంబంధించిన మెటీరియల్ ఉచితంగా పొందవచ్చన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో వర్సిటీలోని తెలుగు విభాగంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 95505 23641 నెంబరులో తెలుసుకోవచ్చన్నారు.

ఆ భూములు.. స్వాహా!

(ఐదో పేజీ తరువాయి)

ఇబ్బందులు ఉండేవి కావు. కానీ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయనేతల నుంచి అధికారుల వరకూ ఒక్కటైపోయారు. రైతులకు దక్కాల్సిన ఫలాలు బ్రోకర్లకు ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. 122 మంది రైతులు ఉండాల్సిన జాబితాలో మరో రైతు చేరిపోయాడు. కంబిరిగాం భూపోరాటంలో ఆయన ఎక్కడా పాల్గొనలేదు. కేవలం భూస్వాముల వద్ద పనిచేసేవాడంతే. ఆయనకు భూస్వాములకు చెందిన భూములను అప్పగించి ఉంటే రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యేవి కావు. కానీ, రైతులకు చెందిన భూముల్లోని 6.09 ఎకరాలను ఆయనకు అప్పనంగా అప్పగించేశారు. దీనిపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంలో స్థానికంగా ఉండే వైసీపీ నాయకులు చక్రం తిప్పగా, ప్రస్తుతం కూడా వారే తమ కనుసన్నల్లో నిషేధిత భూములు కూడా అమ్మకాలు సాగిస్తుండడం హాట్‌టాపిక్‌గా మారింది.

వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలు..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కంబిరిగాం భూములకు రెక్కలు వచ్చాయి. 2021లో సీఎంవో కార్యాలయం నుంచి కొందరు పెద్దలు ఈ వ్యవహారంలో తలదూర్చారు. కంబిరిగాం భూస్వాములకు మద్దతుగా రంగంలోకి దిగడంతో వారికి అప్పనంగా 15 ఎకరాల భూమి ధారాదత్తం జరిగింది. దీంతో ఆగమేఘాలపై సంబంధిత ఫైళ్లు కదిలిపోయాయి. రోడ్డుకు ఒకవైపు రైతులు, మరోవైపు భూస్వాములు ఆ భూములు పంచుకోవడానికి పెద్దమనుషుల మధ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మధ్యవర్తిత్వం వహించనివారు విలువైన భూములను ఉదారంగా తీసుకోగా, విలువలేని భూములను రైతులకు ఇచ్చారు. రైతులకు మొత్తం 129.76 ఎకరాల భూములు ధారాదత్తం కావడంతో వారికి పట్టాదారు పాసుపుస్తకాలు, వన్‌బీలు, నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్క రాత్రిలోనే మొత్తం పనులన్నీ జరిగిపోవాలని నాటి సీఎంవో కార్యాలయ పెద్దల నుంచి ఆదేశాలు అందడంతో స్థానిక రెవెన్యూ అధికారులు అర్ధరాత్రి మీ సేవ కేంద్రాలు తెరిచి రైతులకు వన్-బీలు, నిరంభ్యంతర పత్రాలు అందించారు. సందడిలో సడేమియాగా నిషేధిత ఇనాం భూములకు కూడా వన్-బీలు, నిరంభ్యంతర పత్రాలు అందించారు. దీనిపై రైతులకు కూడా ఎటువంటి అనుమానాలు రాలేదు. తమకు వన్-బీలు ఇచ్చి ఆదుకున్నారు కదా అని మౌనం దాల్చారు. ప్రస్తుతం భూస్వాముల ఆధీనంలో ఉన్న మొత్తం ఇనాం భూములు 80 శాతానికి పైగా అమ్ముడైపోయాయి. అలాగే, అప్పనంగా నాటి సీఎంవో కార్యాలయ పెద్దలకు ఇచ్చిన భూములు కూడా మూడు, నాలుగు చేతులు మారిపోయాయి. జాతీయ రహదారి విస్తరణలో కంబిరిగాం భూముల మీదుగా పలాస బైపాస్ రోడ్డు రావడంతో ఆ భూములు బంగారంగా మారాయి. ప్రస్తుతం ఎకరా రూ.3 కోట్ల వరకూ పలుకుతుంది. వాస్తవానికి ఇనాం భూములను హోల్డ్‌లో పెట్టాలి. కానీ, రెవెన్యూ అధికారులు వాటికి ఎన్‌వోసీలు ఇస్తుండడంతో రిజిస్ట్రేషన్‌లు జరిగిపోతున్నాయి. దీనిపై రెవెన్యూ అధికారులు లోతైనా దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన చీకటి ఒప్పందం, ఆ 15 ఎకరాల ధారాదత్తంపైన కూడా దర్యాప్తు చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులను ప్రశ్నిస్తే 'ప్రభుత్వానికి కావాల్సింది ఆదాయం. అది నిషేధిత భూములా, చుక్కభూములా మాకు అవసరం లేదు. రెవెన్యూ అధికారులు వన్-బీలు, ఎన్‌వోసీలు ఇస్తున్నారు. అవి చాలు భూముల రిజిస్ట్రేషన్‌కు' అని వారు బదులిస్తున్నారు.

సైబర్ సెల్.. ప్చ్!

(ఐదో పేజీ తరువాయి)

ఆశ చూపి వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా యువతకు ఎరవేసి అప్పులు ఇస్తామని ట్రాప్ చేస్తున్నారు. వివరాలను తీసుకొని అడిగినంత సొమ్ము చెల్లిస్తున్నారు. తిరిగి వసూలు చేసే క్రమంలో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అయితే వివాదం ఎందుకని కొందరు సైలెంట్ అవుతూ వారు అడిగినంత చెల్లిస్తున్నారు.

రికవరీలేవీ?

జిల్లాలో వందలాది సైబర్ కేసులు నమోదయ్యాయి. కానీ, రికవరీ, నిందితులను పట్టుకోవడం చాలా తక్కువే. గత నాలుగేళ్లుగా 500 వరకు ఫిర్యాదులు రాగా, నమోదైన కేసులు కేవలం 189 మాత్రమే. అందులో ఛేదించినవి కూడా స్వల్పమే. సైబర్ విభాగానికి ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేసినా సిబ్బంది కొరత, అవరమైన నిధులు సమకూర్చకపోవడంతో కేసుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. భారీ మొత్తంలో నష్టపోయినప్పుడు, బాధితులు ఆర్థికంగా ఉన్నవారైతేనే పోలీసులు స్పందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సైబర్ నేరాళ్లపై కఠిన చర్యలు చేపడుతున్నట్టు జిల్లా పోలీసు యంత్రాంగం చెబుతుంది. పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అంటుంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం సైబర్ నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. సైబర్ నేరం జరిగిన గంటలో 1930కి కాల్ చేస్తే ఫలితముంటుందని అధికారులు చెబుతున్నా ఎటువంటి ఫలితం ఉండడం లేదు. కోర్టులో పిటీషన్ వేయడం ద్వారా న్యాయం జరుగుతుందని తెలుస్తున్నా న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు చాలామంది బాధితులు విముఖత చూపుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి..

ఈకేవైసీ అప్‌డేట్ చేయాలని...ఫలానా యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఫోన్లకు లింక్‌లు వస్తే అస్సలు క్లిక్ చేయకూడదు. మీకు లాటరీ వచ్చింది..కొంత మొత్తం నగదు చెల్లించాలంటే అస్సలు నమ్మకండి. మైక్రోఫైనాన్స్, ఆన్‌లైన్ రుణయాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోకండి. ఆన్‌లైన్ వస్తువుల కొనుగోలు సమయంలో నమ్మకమైన యాప్‌లనే ఆశ్రయించండి అంటూ నిపుణులు సూచిస్తున్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌లు వచ్చినా, రకరకాలుగా బెదిరింపు కాల్స్ వచ్చినా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు గాని, డయల్ 100, 1930, 112కు గాని సమాచారం ఇవ్వాలి. స్క్రీన్ షేరింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు. ఇప్పటికే ఇన్‌స్టాల్ చేసిన వాటిని వెంటనే డిలీట్ చేయాలి.

గత ఏడాది జూన్ 8న శ్రీకాకుళం రూరల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నాడు. బెంగళూరుకు చెందిన ఓ బహుళజాతి సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ పేరుతో పార్శిల్ వచ్చిందని, అందులో మత్తు పదార్థాలు ఉన్నాయని బెదిరించాడు. ఫోన్ కట్ చేసి వీడియో కాల్ చేశాడు. పోలీసు వేషధారణతో ఉన్న వ్యక్తితో భయపెట్టించి రూ.8.20 లక్షలు ఆయన నుంచి వసూలు చేశాడు. చివరకు సైబర్ నేరంగా నిర్ధారించుకొని బాధితుడు శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రత్యేక దృష్టి పెట్టాం..

జిల్లాలో సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఆన్‌లైన్‌లో వచ్చిన మెసేజ్‌లు, లింకులపై జాగ్రత్తగా ఉండాలి. బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. పోలీస్, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి. ఒకే రోజు ఎక్కువ మొత్తంలో నగదు డ్రా చేసే వారిపై నిఘా పెట్టాం. నేరాలు తగ్గుముఖం పట్టేలా, బాధితులకు న్యాయం చేసేలా మా వంతు కృషి చేస్తున్నాం.

-కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

రోడ్డు వేశారు.. బెర్ములు మరిచారు



బెర్ములు లేక పిచ్చి మొక్కలతో ఉన్న సీసీ రోడ్డు

గార రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వమరవల్లి పంచాయతీ హుంకుంపేట రోడ్డు నిర్మాణం చేపట్టినా రెండు వైపులా బెర్ములు వేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో అర్ధాంతరంగా నిలిపివేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన నెలల గడువులో ఎమ్మెల్యే గొండు శంకర్ ఇచ్చిన మాట ప్రకారం సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షల ప్రత్యేక నిధులను మంజూరు చేశారు. దీంతో సీఎస్పీ రోడ్డు నుంచి గ్రామం వరకు 12 అడుగుల వెడల్పు, 1200 మీటర్ల పొడవుతో సీసీరోడ్డు నిర్మించారు. అయితే బెర్ములు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెర్మ్‌ల నిర్మాణం చేపట్టి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

దారి పొడవునా గోతులతో అవస్థలు



గొల్లవూరు-శాసనాం మధ్య దారుణంగా ఉన్న రోడ్డు

సోంపేట రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తురక శాసనాం, ఎకువూరు, రాణిగాం, ఎర్రముక్కాం రోడ్లు దారుణంగా ఉన్నాయి. రోడ్డు పొడవునా గోతులతో వాహనదారులు, స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. తక్షణం మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈఈ ధనుంజయ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా టి.శాసనం, బట్టి గల్లూరు రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. వర్షాల కారణంగా పనులు తాత్కాలికంగా నిలిపి వేశామన్నారు. ఎర్ర ముక్కాం, రాణిగాం రహదారి సెకెండ్ ఫేజ్‌లో నాబార్డు నిధులతో రోడ్డు నిర్మాణం చేపడతామని, అందువల్ల మరమ్మతులు చేపట్టలేదన్నారు.

మానసిక దివ్యాంగులకు తోడుగా ఉండాలి



అధికారుల సమావేశంలో పాల్గొన్న న్యాయాధికారి కె.హరిబాబు

శ్రీకాకుళం లీగల్ సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగులకు తోడుగా ప్రభుత్వ శాఖల అధికారులు పనిచేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. నగరంలోని బెహరా మానసిక దివ్యాంగుల పాఠశాలలో బుధవారం వివిధ శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. మానసిక దివ్యాంగులకు ప్రభుత్వం ద్వారా అందించాల్సిన సదుపాయాలను వివరించారు. జిల్లాలో బుద్ధిహీనత ఉన్న పిల్లలను సమగ్రంగా గుర్తించి వారికి వివిధ పథకాలను అందించే దిశలో అధికారులు సమన్వయంతో పనిచేయాల న్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణపతిరావు, న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, జిల్లా బాలల రక్షణ అధికారి రమణ, ఏపీఎం ధనలక్ష్మి పాల్గొన్నారు.

'అపూర్వ' కలయిక



1972 బీఎస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అరసవల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ కళాశాలలో 1972లో బీఎస్సీ చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం స్థానికంగా ఓ హోటల్‌లో నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చదువుకున్న రోజుల్లోని కొన్ని విచిత్రమైన, అపురూపమైన సంఘటనలను మననం చేసుకుని ఆనందంతో పులకించిపోయారు. కన్వీనర్‌గా పిండి నాగేశ్వరరావు, నిర్వాహకుడిగా బొడ్డేపల్లి చిరంజీవిరావు, ఎ.కాశీబాబు, పీఎస్ఆర్ మూర్తి, దుంపల సన్యాసిరావు, ఎం.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ అధ్యయనంతో వైజ్ఞానిక మార్పులు



ప్రొఫెసర్ సంధ్యను సత్కరిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ అధ్యయనంతో వైజ్ఞానిక రంగంలో సమూల మార్పులకు అవకాశం కలుగుతుందని గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.సంధ్య అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో క్వాంటమ్ టెక్నాలజీపై మూడు రోజుల ప్రత్యేక ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం బుధవారం ప్రారంభమైంది. ఆచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్రాడ్యుయేషన్ స్టడీస్ (బెంగుళూర్)కు చెందిన ప్రొఫెసర్ ఎస్.రాంకుమార్ మాట్లాడుతూ.. గణితం, భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్ట్ లతో పాటు పలు రంగాలకు క్వాంటమ్ కంప్యూటింగ్‌తో బహుళ ప్రయోజనం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రొఫెసర్ పి.సుజాత, ప్రిన్సిపాళ్లు ఎస్.ఉదయభాస్కర్, సీహెచ్.రాజశేఖరరావు, ఫిజిక్స్ విభాగం అధ్యాప కుడు పి.శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ అధ్యాపకులకు సత్కారం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ ఆర్‌డీఎల్‌వీ క్రిస్టియన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ లెక్చరర్ డాక్టర్ కె.సుధారాణిలను బుధవారం సత్కరించారు. ప్రిన్సిపాల్ టి.విక్టర్ పాల్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్.సంజీవరావు, యు.ప్రమీల, కె.యమున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వనాథ జయంతి



నివాళి అర్పిస్తున్న వేదిక ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతిని శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వేదిక అధ్యక్షుడు మణిపాత్రుని నాగేశ్వరరావు మా ట్లాడుతూ విశ్వనాథ వేయిపడగలను రచించి జ్ఞానపీఠ్ అవార్డు పొందారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి డబ్బీరు గోవింద రావు, కార్యద ర్శులు వాడాడ శ్రీనివాసరావు, చాడ శ్రీనివాస్, విజయ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల హబ్‌గా మారుస్తా: రవికుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యంగా పనిచేసున్నారని ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్కిల్ డెవలప్ మెంట్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో యువత పరిశ్రమల స్థాపనకు సహకరిస్తే ఐదేళ్లలో పరిశ్రమల హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌తో పాటు పొందూరు మండలంలో పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఫ్యూయల్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన పలువురు యువతీ యువకులకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈవో అప్పలనాయుడు, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ సాయికుమార్, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యా సాగర్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ మొదలవలస రమేష్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రోత్సాహం: అశోక్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. ఇద్దివానిపాలెంలో బుధవారం ఫిష్ ప్రోసెసింగ్ యూనిట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మత్స్యకారుల అభ్యున్నతికి టీడీపీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, ఏఎంసీ ఛైర్మన్ మణిచంద్రప్రకాష్, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కృష్ణారావు, పీఏసీఎస్ ఛైర్మన్ బాసుదేవ్ ప్రధాన్, నేతలు బి.విజయకుమార్, బి.రమేష్, బి.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక ప్రారంభం

కంచిలి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జలంత్రకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక టీడీపీ నాయకుడు సంజయ్‌కుమార్ పండా తన తండ్రి కృష్ణచంద్రపండా జ్ఞాపకార్థం నిర్మించిన కళావేదికను బుధవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజుతో కలిసి ప్రారంభించారు. హెచ్ఎం ఉమామహపాత్రో, కూటమి నేతలు పాల్గొన్నారు. పాఠశాలలో గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన జాతీయ నేతల విగ్రహాలను ప్రారంభించారు.

ఏపీఎంగా కూర్మారావు



పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వెలుగు ఏపీఎంగా పైడి కూర్మారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు వెలుగు సిబ్బంది బొకేలు ఇచ్చి స్వాగతం పలికి అభినందించారు. ఈయన మందస నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఎరువులు సక్రమంగా అందించండి

కంచిలి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. యూరియా కొరత, ఈక్రాప్ పెండింగ్, అన్నదాత సుఖీభవ పెండింగ్ లబ్ధిదారుల సమస్యల పరిష్కారం కోసం తీర్మానం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఎంపీడీవో తిరుమలరావు, సీఎస్‌డీటీ కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

జి.సిగడాం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు కూడళ్ల వద్ద ఎస్ఐ వై.మధుసూదనరావు ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. గొబ్బూరు, సర్వేశుపురం తదితర కూడళ్ల వద్ద ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలను నిలిపి ధ్రువపత్రాలు పరిశీలించారు.

సేవలపై అవగాహన కలిగించాలి

గార, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ద్వారా ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సేవ లపై ప్రజలకు అవగాహన కలిగించాలని సీడీపీవో జి.శోభారాణి సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో శ్రీకాకుళం, గార మండలాల అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన లక్ష్యాలను వివరించాలన్నారు. సంకల్పం పది రోజుల పాటు నిర్వహించే కార్యక్రమమన్నారు. ఈనెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు పోషణ మాస్ క్యాలెండర్‌లో రూపొందించిన కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

జి.సిగడాం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాలికలు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీవో జోల పాపినాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాల, కేజీబీవీల్లో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కిశోర బాలికలు సక్రమంగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.లక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

రణస్థలం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్థక శాఖ జేడీ కె.రాం గోపాలరావు అన్నారు. బుధవారం ఎర్రవరంలో ఎంవీఆర్ మిల్క్ ప్రొడెక్టు పరిశ్రమను పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా 50 శాతం రాయితీపై సమీకృత పశువుల దాణా, 75 శాతం రాయితీతో పశు గ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏడీ దుర్గారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఎచ్చెర్ల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ధ్యానంతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు యోగా విభాగం, బాబాజీ సుషమ్న క్రియో యోగా ఫౌండేషన్ (విశాఖపట్నం) సంయుక్తంగా యోగా, ధ్యానంపై అవగాహన కలిగించారు. యోగా ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.శిరీష విద్యార్థులకు యోగా, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరించారు. ఏవో ముని రామకృష్ణ, యోగా విభాగాధిపతి జి.ఈశ్వరరావు, యోగా శిక్షకురాలు కె.అర్చన పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం



మండల సమావేశంలో వైసీపీ, టీడీపీ సభ్యుల వాగ్వాదం

లావేరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సభ్యులున్న చోట ఎక్కువగా, టీడీపీ సభ్యులున్న చోట తక్కువగా మండల పరిషత్ నిధులు కేటాయించడంపై ఇరువర్గాల సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. సభ్యుల వాగ్వాదాల నడుమ సమావేశం వాడీవేడిగా సాగింది. వివరాలిలా ఉన్నాయి.. బుడతవలస ఎంపీటీసీ ముల్లు సాయి మాట్లాడుతూ.. నిధుల కేటాయింపులో తేడాలేమిటని ప్రశ్నించారు. వైసీపీ సభ్యులున్న చోట ఎక్కువగా కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ అధికారులను నిలదీశారు. దీంతో ఎంపీటీసీ సభ్యులు జగ్గురోతు తవిటినాయుడు, జనపాల భానోజీ రావు, గుర్రాలపాలెం సర్పంచ్ షేక్ చాందీ భాషాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సభకు గైర్హాజరు కావడంపై పలువురుసభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఊరూరా మద్యం బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా ఎక్సైజ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం పై అదపాక ఎంపీటీసీ గంట్యాడ సత్యం ఆశాఖ రణస్థలం ఎస్ఐ షర్మిలను నిలదీశారు. జీజీవలస గిరిజనులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన డిపట్టా భూములకు వన్‌బీలు ఎందుకు రావడం లేదని లావేరు-2 ఎంపీటీసీ ఐ.సతీష్ తహసీల్దార్ శ్రీనివాసరావును ప్రశ్నించారు. అదపాకలో మూడు నెలలుగా ఏఎన్ఎం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సత్యం అన్నారు. ఏకగ్రీవ పంచాయతీ లకు ప్రభుత్వం అందించాల్సిన ప్రోత్సాహక నిధులు నేటికీ ఇవ్వలేదని రొంపవలస సర్పంచ్ చిత్రి నీలిమా విజయ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో జడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల ప్రత్యేకాహ్వానితుబు రొక్కం బాలకృష్ణ, ఎంపీడీవో వెంకట రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఖ్యాతిని ఇనుమడించిన 'వడ్డాది'



వడ్డాది చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్ సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనరులను ఉపయోగించి చిత్రాలను మలచి జిల్లా ఖ్యాతిని ఇనుమడించిన వ్యక్తి వడ్డాది పాపయ్య అని వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఇందిరా ప్రసాద్ అన్నారు. ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య జయంతిని స్థానిక క్రాంతి భవన్‌లో భారత సాంస్కృతిక సహకార సేవా సంఘం (ఇస్కఫ్) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పాపయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చందమామ, స్వాతి, నవ్య, విజయ తదితర పత్రికల ముఖ చిత్రాల్లో వడ్డాది పాపయ్య వేసిన బొమ్మలు చిరస్థాయి కీర్తిని పొందాయన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు ఎంవీ మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జీవీ నాగ భూషణరావు, వనిత వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మి, రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సెక్రటరీ వడ్డాది విజయకుమార్, పి.రాఘవేంద్ర రావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులపై అవగాహన కల్పించాలి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

గార, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎరువుల సరఫరాపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులకు అవసరమైన ఇండెంట్‌లను సంబంధిత సిబ్బంది సిద్ధం చేయాలని, ఎరువులు వచ్చిన వెంటనే వారికి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలకృష్ణ, ఎంపీడీవో ఈశర్ల రాము, తహసీల్దార్ చక్రవర్తి, ఏవో డి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరైన మోతాదులో వాడాలి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంటల్లో యూరియాను సరైన మోతాదులో వాడితేనే ప్రయోజనమని మండల ప్రత్యేకాధికారి సీహెచ్ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం లొద్దపుట్టి, మండపల్లి, బిర్లంగి గ్రామాల్లో రైతులకు యూరియా వాడకంపై అవగాహన కలిగించారు. యూరియా పంపిణీ ఆర్ఎస్‌కే, పీఏసీఎస్, ప్రైవేట్ డీలర్ల ద్వారా జరుగుతుందని తెలిపారు. జిల్లాలో యూరియా కొరత లేదని తగినంత మో తాదులో అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీవో రామారావు పాల్గొన్నారు.

విచారణకు రాకపోవడంపై డీఎల్పీవో అసంతృప్తి

నరుబుజ్జిలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మతలబుపేట గ్రామ పంచాయతీ ఏకగ్రీవ నిధులపై ఫిర్యాదు చేసిన వ్యక్తి విచారణకు హాజరుకాకపోవడంపై డీఎల్పీవో ఆర్.గోపిబాల అసంతృప్తి వ్యక్తంచేశారు. ఏకగ్రీవ పంచాయతీకి సంబంధించి 2017లో మంజూరైన రూ.7 లక్షలు నిధులు దుర్వినియోగం అయినట్లు అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సనపల తవిటి నాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం గ్రామంలో డీఎల్పీవో విచారణ చేప ట్టేందుకు వచ్చారు. అయితే ఈ విచారణకు అప్పటి పంచాయతీ సభ్యులు హాజరై ఆ నిధులతో చేపట్టిన పనుల ఎంబుక్‌లను, రికార్డులను ఆయన ముందుంచారు. అయితే ఈ విచారణకు సదరు ఫిర్యాదుదారు హాజరుకాకపోవడంపై డీఎల్పీవో అసంతృప్తి వ్యక్తంచేశారు. తప్పుడు ఫిర్యాదులు చేసి అధికారుల సమయాన్ని వృథా చేయడం ఏమిటని ఆయన వెనుదిరిగారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బి.రామారావు, టీడీపీ నాయకులు నూక కోటేశ్వరరావు, ప్రభాకర్, సనపల రాజు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

జి.సిగడాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి అన్నారు. బుధవారం స్థానిక ఆదర్శపాఠశాల, ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరు ఉన్నత పాఠశాలల నుంచి సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

14న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా బాల బాలికల జట్ల ఎంపికలను ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ఛైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, సంఘం అధ్యక్షుడు నక్క కృష్ణారావు, కార్యదర్శి సాధు ముసలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలను 14న ఉదయం 9గంటలకు శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తు న్నామన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 20 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. ఈ ఎంపికలు మ్యాట్‌పై నిర్వహించడం జరుగుతుందని, క్రీడాకారులు మ్యాట్ షూ ధరించి ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు వద్ద రిపోర్టు చేయాలన్నారు.

న్యూస్ బాక్స్

నేటినుంచి డైట్‌లో కళా ఉత్సవం

గార, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వమరవెల్లిలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో జిల్లా స్థాయి కళా ఉత్సవం గురువారం ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ ఎ.గౌరీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 90 పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాల పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

అక్టోబరు 4 నుంచి సీఐటీయూ జిల్లా మహాసభలు

సోంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోంపేటలో అక్టోబరు 4, 5 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, వీటిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కోరారు. కలాసీ సంఘ భవనంలో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, శ్రామిక మహిళా కన్వీనర్ కె.నాగమణి పాల్గొన్నారు.

లైఫ్ స్కిల్స్ పెంచుకోవాలి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి కెరీర్ అండ్ లైఫ్ స్కిల్స్ పెంచు కోవాలని, తద్వారా మంచి ఉద్యోగాలు సాధించవచ్చని జేసీఐ జోన్ ట్రైనర్ ఎం.సునీత అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరీర్, స్కిల్స్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షుడు జయదేవ్, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

నిధుల ఉపసంహరణకు వీలు కల్పించాలి

ఆమదాలవలస, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరగని పాఠశాలల్లో నిధులు ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ డిమాండ్ చేశారు. బుధవారం అక్కులపేట, బొబ్బిలిపేట, కొల్లివలస, చిట్టివలస, ధర్మాన్న పేట, తురకపేట, దివంజీపేట, జొన్నవలస పాఠశాలలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు బి.రమేష్‌కుమార్, హెచ్ఎం డి.జయలక్ష్మి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

రణస్థలం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.30వేలు ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం కోష్ట జంక్షన్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీ

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం ఆధ్వర్యంలో వారధి ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. వ్యాసరచనలో రత్తకన్న పాఠశాల, వక్తృత్వ పోటీల్లో మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. హెచ్ఎంలు బి.శ్రీనివాసరావు, ప్రకాష్ పాల్గొన్నారు.

భయాందోళనగా..

అక్కుపల్లి పాత పీహెచ్‌సీ భవనం శిథిలమై తుప్పల మధ్య ఉండడంతో స్థానికులు, ఆసుపత్రి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే జనావాసాల నడుమ ఉన్న ఈ భవనం తొలగించాలని ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో విషజంతవులకు నిలయంగా మారిందని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువస్తుందోనని వారంతా భయాందోళన చెందుతున్నారు. తరచూ విషసర్పాలు ఈ పిచ్చి మొక్కల నడుమ కనిపిస్తున్నాయని, అందువల్ల ఈ భవనాన్ని తొలగించాలనిని గ్రామస్థులు కోరుతున్నారు. - వజ్రపుకొత్తూరు



తుప్పల నడుమ ఉన్న పాత ఆసుపత్రి భవనం

శిథిలావస్థలో..



హరిద్వారం వద్ద ప్రయాణికుల విశ్రాంతి భవనం ఇలా..

హరిద్వారం గ్రామంలో ప్రయాణికుల విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరింది. భవనం గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అటు టెక్కలి, ఇటు పాతపట్నం వెళ్లేందుకు బస్టాండ్ వద్దకు వచ్చి వారికి కనీసం నిల్చోవడానికి నీడ సైతం లేదు. ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వేచిచూడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - పాతపట్నం రూరల్

స్వచ్ఛతేదీ?

లింగాలవలస ఆరోగ్య ఉపకేంద్రం వద్ద అపరిశుభ్రత నెలకొంది. మూడేళ్ల కిందట ఇక్కడ ఆరోగ్య ఉప కేంద్రాన్ని నిర్మించారు. అయితే, నిర్వహణను పట్టించుకోక పోవడంతో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. వాటిని తొలగించకపోవడంతో అటువైపు వెళ్లాలంటేనే రోగులు భయపడుతున్నారు. పిచ్చి మొక్కల కారణంగా విషసర్పాలు, కీటకాలు ఆరోగ్య కేంద్రం లోపలకు వచ్చేస్తున్నాయని రోగులు అంటున్నారు. అధికారులు స్పందించి భవనం చుట్టుపక్కల ఉన్న పిచ్చిమొకలను తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - టెక్కలి రూరల్



పిచ్చి మొక్కలతో కనిపిస్తున్న లింగాలవలస ఆరోగ్య కేంద్ర

వృథాగా..



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కల మధ్య ఉన్న 104 వాహనం

పలాస తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గత ఐదు సంవత్సరాల నుంచి 104 వాహనం నిలుపుదల చేసి వదిలిపెట్టారు. ఆ వాహనాన్ని వినియోగంలోకి తీసుకురాకుండా వదిలివేయడంతో తుప్పు పట్టి మూలకు చేరింది. వాహనం చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో దేనికి పనికిరాకుండా పోయింది. ప్రభుత్వ వాహనాన్ని వినియో గించకుండా ఇలా వృథాగా వదిలివేయడం ఏమిటని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా 104 వాహనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. - పలాస రూరల్

అమెజాన్ ఏజెన్సీ ఇప్పిస్తానని చెప్పి..

- ఫేక్ ఐడీ ద్వారా నగదు స్వాహా
- మోసపోయినట్టు గుర్తించి పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పలాస, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో అమెజాన్ ఏజెన్సీ ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి ఫేక్ ఐడీ ద్వారా రూ.35,400 స్వాహా చేశాడు. ఇంకా మరో రూ.2 లక్షలు ఇస్తే అనుమతులు ఇప్పిస్తానని చెప్పడంతో అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో అసలు బండారం బయట పడింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాశీబుగ్గ కేటీ రోడ్డులో వివిధ పత్రికలకు ఏజెన్సీ నిర్వహిస్తున్న జి.తిరుమల ఈ నెల 6వ తేదీన ఓ అపరిచిత వ్యక్తి కలుసుకున్నాడు. తనది ఎస్.కోట మండలం ధర్మవరం అని, తన పేరు హర్షవర్ధన్‌గా పరిచయం చేసుకున్నాడు. తాను అమెజాన్ ఏజెన్సీలను ఇప్పించేందుకు ఈ ప్రాంతంలో అధికారిగా నియమించారని, ఏజెన్సీ కావాలంటే తనను సంప్రదించాలని కోరాడు. దీంతో ఆయన వేషభాష చూసి ఆయన్ని తిరుమల నమ్మాడు. తనకు ముందుగా రూ.35,400 నగదు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నాడు. దీంతో తిరుమల ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేశాడు. దీంతో ఆయన వెళ్లిపోయాడు. మంగళవారం సాయంత్రం మళ్లీ వచ్చి రూ.2లక్షలు నగదు ఇస్తే ఏజెన్సీ ఖరారు చేస్తానని కోరడంతో పాటు గాబరా పెడుతుండడంతో తిరుమలకు అనుమానం వచ్చింది. దీంతో స్థానికంగా ఉండే అమెజాన్ ఏజెన్సీ నిర్వాహకులను తిరుమల సంప్రదించాడు. ఈ ప్రాంతలో కొత్తగా మరో బ్రాంచ్ ఇచ్చే అవకాశాలు లేదని తెలుసుకుని, కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో హర్షవర్ధన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మెయిల్ ఐడీలో నగదు జమయినట్లు గుర్తించారు. ఎస్ఐ నర్సింహమూర్తి మాట్లాడుతూ.. జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి అకౌంట్‌లో నగదు జమయినట్టు గుర్తించామన్నారు. ఆ బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేయించేలా సంబంధిత బ్యాంకు అధికారులకు తెలియజేయాలని బాధితుడికి సూచించినట్టు ఎస్ఐ తెలిపారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



కోటబొమ్మాళి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పాకివలస జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం లారీ బోల్తా పడి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులో పడింది. విశాఖ నుంచి ఒడిశా వైపు ఇనుప రాయి ముడి సరుకుతో వెళ్తున్న 22 టైర్లు కలిగిన టెయిలర్ లారీ.. పాకివలస జంక్షన్‌కు వచ్చే సరికి డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు వాపోతున్నారు. ఏడాది కిందట ఇక్కడే ఓ కారు అదుపుతప్పి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులో స్కూటీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలిపై పడింది. ఆ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇప్పుడు లారీ కూడా అదే విధంగా పడడం.. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఇద్దరిపై కేసు నమోదు

కొత్తూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తన కార్యాలయంలోకి నివగాం గ్రామానికి చెందిన బూరాడ రాకేష్, భూరాడ కమలహాసన్ మంగళవారం చొరబడి విధులకు ఆటంకం కలిగించారని వెలుగు ఏపీఎం ఎ.లలిత ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గ్యాస్ లీకేజీ.. తప్పిన ముప్పు

నరసన్నపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర థియేటర్ సమీపంలోని మానెం పాపారావు స్వీట్ దుకాణంలో బుధవారం ఉదయం గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉదయం స్వీట్ తయారు చేసేందుకు గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. గది మొత్తం మంటలు వ్యాపించి బయటకు పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. గ్యాస్ స్టవ్ వెలిగించిన సమయంలో పాపారావు చాకచాక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. లీకైన గ్యాస్ వంట గది నిండా విస్తరించడంతో ఈప్రమాదం జరిగిందని అగ్ని మాపకశాఖ అధికారులు నిర్ధారించారు. ప్రమాదంలో ఎవ్వరికి ఏమి జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల ఆస్తి నష్టం ఉండొచ్చని అగ్ని మాపకశాఖ అధికారి వరహాలు తెలిపారు.

యూరియాపై ఫేక్ ప్రచారాలు మానుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

టెక్కలి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా యూరియాను తెప్పించి ఆయా రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల కు పంపిణీ చేస్తుంటే వైసీపీ నాయకులు ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని టెక్కలి, నందిగాం మండలా టీడీపీ అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన మూడు విడతల యూరియా ఇప్పటికే రైతుల కు అందేటట్లు చర్యలు తీసుకున్నారన్నారు. టెక్కలిలో వైసీపీ నాయకులు పేడాడ తిలక్ యూరియా కొరతని ర్యాలీలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాయకులు మామిడి రాము, హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం, లవకుమార్, షన్ముఖరావు, అప్పలస్వామి, ప్రీతీష్, కిరణ్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు విజయవంతం చేద్దాం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అధికారులంతా సమన్వయంతో పని చేసి ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలను విజయవంతం చేద్దామని టెక్కలి ఆర్‌డీవో ఎన్.కృష్ణమూర్తి అన్నారు. బుధవారం ఉత్సవ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో పరిశీలించారు. అనంతరం అలయ ఆవ రణలో సమావేశం నిర్వహించారు. ఆలయానికి రంగులు, అతిథులకు ఆహ్వాన పత్రికలపై ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లపై ఆరా తీశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, అర్‌అండ్‌బీ ఏఈ బి.సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి గడ్డెమ్మ, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, తహసీల్దార్ అప్పలరాజు, ఎస్ఐ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల తరలింపుపై దర్యాప్తు

కొత్తూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కురిగాం సచివాలయ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రం నుంచి అక్రమంగా ఎరువులు తరలించారని పలువురు డయల్ యువర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంపై దర్యాప్తు చేస్తున్నట్టు జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం కురిగాం, మహాదేవపురం గ్రామాలను సందర్శించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇవ్వాల్సిన ఎరువులు ఏఏవో దారిమళ్లించారని గతంలో ఆరోపణలు రావడంతో అప్పటిలో మండల అధికారులు దర్యాప్తు నిర్వహించి ఉన్నత అధికారులకు నివేదిక అందజేశారు. మళ్లీ పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఎంపీడీవో వి.నీరజ, ఏవో స్వర్ణలత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన ఉండాలి



ప్రవచనాలు చెబుతున్న స్వామీజీ

మెళియాపుట్టి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన ఉంటే ప్రశాతంగా ఉంటారని మైసూర్ దత్త పీఠం ఉత్తరాధికారి విజయానంద్ తీర్థ స్వామిజీ తెలిపారు. బుధవారం పెద్దపద్మాపురంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆధ్యాత్మిక చింతనకు సమయం కేటాయించా లన్నారు. ప్రతి ఒక్కరిలో ప్రేమ, జ్ఞానం, ప్రశాంతత ఉండాలన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, కోటేశ్వరావు,వసంత్,సత్యం భక్తులు తదితరులు ఉన్నారు.



అణగాష్టమి వ్రతాలను ఆచరిస్తున్న మహిళలు

- నందిగాం: దిమ్మిడిజోలలో మైసూర్ దత్త పీఠం ఉత్తరాధికారి విజయానంద్ తీర్థ స్వామిజీ పర్యటించారు. గ్రామస్థులు, దత్త వలంటీర్లు స్వామీజీకి ఘనంగా స్వాగతం పలికారు. స్వామీజీ భక్తులకు అనుగ్రహబాసన చేస్తూ ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. అంతకుముందు దత్త భక్తులు నగరసంకీర్తన నిర్వహించి అణగాష్టమి వ్రతాన్ని వందలాదిమంది భక్తులచే నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణరావు, నిర్విశ్యానంద స్వామీజీ, సలాన కృష్ణారావు, కూర్మారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఐతమ్‌లో రెండురోజుల వర్కుషాప్

టెక్కలి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలల ఐటీ విద్యార్థులకు జెంట్రో బైట్ సొల్యూషన్స్, హైదరాబాద్ సంస్థ సహకారంతో రెండు రోజుల వర్క్‌షాప్, ఒకరోజు హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమ నిపుణుల నుంచి మార్గదర్శకత్వం, రియల్ టైమ్ ప్రాజెక్ట్ డెవలప్మెంట్‌కు ఉపయోగపడే శిక్షణలు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, ఐఐసీ డీన్ జి.సతీష్‌తో పాటు కన్వీనర్‌గా ఐటీ విభాగం హెడ్ డాక్టర్ బి.రమేష్‌నాయుడు, కో-కన్వీనర్‌గా టి.సాయిసతీశ్వరరెడ్డి, కోఆర్డినేటర్‌గా పి.సుధీర్‌కుమార్, పి.ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా 'ఆపస్' నూతన కార్యవర్గం

పాతపట్నం, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ఆపస్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైనట్టు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి దువ్వారి చలపతిరావు తెలిపారు. స్థానిక ఆపస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించి ఎన్నికల్లో మండలశాఖ అధ్యక్షుడిగా మురళీమోహన్ పాత్రో ప్రధాన కార్యదర్శిగా సోమేశ్వరరావు గౌరవాధ్యక్షుడిగా శరత్‌చంద్రపాడీ, కోశాధికారిగా శ్యామ్‌బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా బీవీ రమణ వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘబాధ్యులు మోహనరావు వైకుంఠరావు హరిబిస్వాల్ అప్పన్న మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమారన్న స్ఫూర్తితో పోరాడుదాం



మాట్లాడుతున్న సీపీఎంఎల్ నేత ప్రసాద్

పలాస రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుమారన్న స్ఫూర్తితో పోరాటం సాగిద్దామని సీపీఐఎంఎల్ రాష్ట్రఅధికార ప్రతినిధి పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. పలాస మండలం పెదగంతారులో బుధవారం కామ్రేడ్ కుమారన్న, సీతారామ్ వర్ధంతి సభకు హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఉన్న సహజ వనరుల దోపిడీ చేయడానికి బహుళజాతి సంస్థలకు కేంద్రంలో మోడీ సర్కార్ ఊతమిస్తుందని, కగార్ పేరుతో ఆదివాసీలపై హింసకు పాల్పడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో సహజవనరులను రక్షిస్తున్న ఆదివాసీలపై వివిధ రకాలుగా హింసను ప్రేరేపిస్తూ బహుళజాతి కంపెనీలకు ఒత్తాసు పలుకుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం చేసేందుకు సిద్ధం కావాలన్నారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, రాష్ట్ర అరుణోదయ ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్, పీవోడబ్ల్యూ నాయకులు పోతనపల్లి కుసుమ, బతకల ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌సిటీ రైలు నిలుపుదల చేయాలి

సంతబొమ్మాళి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): బరంపూర్-విశాఖ ఇంటర్‌సిటీ రైలు కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. గతంలో బరంపూర్ నుంచి విశాఖ వరకు పాసింజర్‌గా నడిచేది. అప్పట్లో కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ నిలుపుదల చేసేశారు. అయితే కరోనా అనంతరం ఈ రైలును ఇంటర్‌సిటీగా మార్చారు. అప్పటి నుంచి ఈ రైలు కోటబొమ్మాళిలో నిలుపుదల చేయడం లేదు. దీంతో ఈ ప్రాంతవాసులు అటు విశాఖ వైపు ఇటు బరంపూర్ వైపు వెళ్లేవారు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి ఇంటర్ సిటీ రైలు నిలుపుదల చేయాలని కోరుతున్నారు.

రణభేరిని విజయవంతం చేయండి

జలుమూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, ఉద్యోగులు మరియు పాఠశాలల్లో ఆర్థిక విద్యా రంగ సమస్యలపై పోరాటం చేయడానికి ఈ నెల 15 నుండి 19 వరకు నిర్వహించే రణభేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి పిలుపునిచ్చారు. చల్లవానిపేట ఉన్నత పాఠశాలలో బుధవారం రణభేరీ పోస్టర్లను ఆవిష్కరించారు. రణభేరీకి ఐదు దళాలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు కోరాడ వైకుంఠరావు, మండలశాఖ గౌరవ అధ్యక్షుడు జి.రాము పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అలవర్చుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పోలాకి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్య అలవరచుకోవాలని పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతు పద్మావతి అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. గతేడాది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందచేశారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు గోవిందరావు, ఎల్‌వీ నరసింహం, త్రినాథరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆల్ ఆంధ్రా రోడ్డులో ట్రాఫిక్ జామ్



నిలిచిన వాహనాలు

మెళియాపుట్టి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పాతపట్నం - మెళియాపుట్టి అల్‌ఆంధ్ర రోడ్డులో బుధవారం సుందరాడ వద్ద లారీ కూరికి పోయి ట్రాఫిక్ జామ్ అయింది. ఇటీవల కురిసిని వర్షాలకు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో పాటు ఉద్దానం ప్రాజెక్టు పేజ్-2 పనులు సైతం రోడ్డు పక్క నుంచే పైపులు వేయడం వల్ల వాహనాలు దిగిపోతున్నాయి. సింగల్ రోడ్డు కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించుకోవడం కష్టంగా మారింది. దీనితో తరుచూ వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పాడుతుంది. దీంతో ఐదు గంటలు సేపు వాహనాలు రాకపోకలు అంతరాయం ఏర్పడింది. అయితే బుధవారం రాత్రి జేసీబీల సాయంతో కూరుకుపోయిన లారీని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

మాత, శిశు మరణాలు లేకుండా చూడండి

పోలాకి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మాతృ, శిశు మరణాలు జరగకుండా ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు చూసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజక్టు అధికారిణి భవానీ అన్నారు. బుధవారం ఆమె పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అమలుచేస్తున్న ఆహార ఉత్పత్తులను పిల్లలు, బాలింతలు , గర్భిణీలు వినియోగించుకోవాలన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు శుభరాట

నందిగాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నందిగాంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు జరిపేందుకు బుధవారం శుభరాట వేశారు. ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు సంబంధించి స్థానిక అండర్ పాసేజ్ సర్వీస్ రహదారి సమీపంలో జరిపేందుకు సనపల అప్పలరాజు, మేనకా దంపతుల ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు మేడేపల్లి రమేష్‌శర్మ పర్యవేక్షణలో శుభరాట వేశారు.

- నరసన్నపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జయదుర్గా భవానీటాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పందిరిరాట వేశారు. విగ్రహాదాత పి.షన్ముఖరెడ్డి, టాక్సీయూనియన్ గౌరవ అధ్యక్షుడు ముత్తా కిరణ్ కుమార్ ప్రత్యేక పూజలను చేపట్టారు. యూనియన్ నాయకులు లక్ష్మణరావు, అప్పన్న, బుజ్జి, మురళి పాల్గొన్నారు.



నరసన్నపేట: పందిరి రాట వేస్తున్న ట్యాక్సీ యూనియన్ సభ్యులు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గూడెం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై రావాడ కృష్ణ(53) మృతి చెందిన ఘటన సంభవించింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గూడెం గ్రామానికి చెందిన రావాడ కృష్ణ తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం గ్రామంలోని పక్క వీధిలో అప్పారావు ఇంటి కి, ఇంటి స్లాబ్ షేడ్ డిజైన్ కోసం 16ఎంఎం రాడ్‌తో పనిచేస్తున్న సమయంలో ఆ రాడ్డు ఇంటి వద్ద గల 11 కేవీ వైరుకు తగిలి విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. స్థానికులు గమనించి వైద్యం కోసం దగ్గరలోని జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈయనకు భార్య భారతి, ఇద్దరు కుమార్తెలున్నారు. మొదటి కుమార్తెకు వివాహం కాగా, చిన్న కుమార్తె బెంగళూరులో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తోంది. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

టెక్కలి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజారవాణా వ్యవస్థలో అమలుచేస్తున్న ఉచిత మహిళా బస్సు ప్రయాణంపై సందేహాలు, సలహాలు, అభ్యర్థనలు స్వీకరించేందుకు టెక్కలి ఆర్టీసీ డిపో పరిధిలోని మహిళా ప్రయాణికుల కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణానికి సంబంధించి ఎదురయ్యే సమస్యలతో పాటు వారి సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 9959225611 నెంబరుకు సంప్రదించాలన్నారు.

కలెక్టర్ వస్తున్నారని..



కేటీ రోడ్డులో బ్లీచింగ్ చల్లిన దృశ్యం

కాశీబుగ్గ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గలోని పాత జాతీయ రహదారి బుధవారం అద్దంలా మెరిసిపోయింది. ఉదయం 7 గంటలకే రోడులో పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్డుకిరువైపులా శుభ్రం చేశారు. చిన్నపాటి కాగితం కూడా లేకుండా చేశారు. బ్లీచింగ్ చల్లారు. దీంతో స్థానికులు చర్చించుకోవడం కనిపించింది. ఎవరైనా మంత్రి వస్తున్నారా? అంటూ ఆరాతీసిన వారూ ఉన్నారు. అయితే జిల్లా కలెక్టర్ వస్తున్నారని తెలుసుకొని అదా కథ అంటూ తేలిగ్గా తీసుకున్నారు. ఇటీవల ఎరువుల కొరత నేపథ్యంలో స్వయంగా ఎరువుల పంపిణీని పర్యవేక్షించేందుకు కలెక్టర్ వస్తున్నారని మునిసిపల్ అధికారులకు సమాచారం అందింది. దీంతో పాత జాతీయ రహదారి మార్గాన్ని పారిశుధ్య కార్మికులతో జల్లెడ పట్టేశారు. ప్రతిరోజూ ఏదో ఒక అధికారి వస్తే బాగున్ను అంటూ స్థానికులు చర్చించుకోవడం కనిపించింది.

200 మందికి వైద్య పరీక్షలు

టెక్కలి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ప్రారంబించారు. వైద్యులు అపూర్వ నిరంజన్, స్వాతి, క్రాంతికిరణ్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వమించారు. సంఘ అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు, ధనుంజయరావు, బొడ్డ అయ్యబాబు, రెయ్యి పున్నయ్య, వీరస్వామిరెడ్డి, డీఏ స్టాలిన్, కామేశ్వరరావు, జీవీ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఈ-శ్రమ రిజిస్ట్రేషన్ స్పెషల్ డ్రైవ్

టెక్కలి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీ వరకు ఈ-శ్రమ రిజిస్ట్రేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు సహాయ కార్మిక అధికారి ఆర్.రాధాకుమారి, తహసీల్దార్ బి.సత్యం తెలిపారు. బుధవారం ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఈ-శ్రమ పోర్టల్ నమోదు చేస్తామని, అసంఘటిత రంగ కార్మికులు దీన్ని వినియోగించుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి టెక్కలిలో మీసేవ కేంద్రాన్ని ఎంపిక చేశామన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో కూడా నమోదు చేసుకోవచ్చాన్నారు. కార్యక్రమంలో అద్దాల రాజేష్ తదితరులు ఉన్నారు.

నేడు, రేపు క్రీడాకారుల ఎంపిక

నందిగాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో పాఠశాల క్రీడాకారుల ఎంపిక పోటీలు గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్నట్టు ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు, స్థానిక ఉన్నతపాఠశాల హెచ్‌ఎం కె.హేమలత, పీడీ ఎస్.రమేష్ తెలిపారు. స్థానిక ఉన్నతపాఠశాల వేదికగా అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలిరోజు బాలురుకు, రెండోరోజు బాలికలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, యూపీ పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

28 గేదెలు పట్టివేత

లావేరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి విజయనగరం జిల్లా అలమండ వారపు సంతకు 28 గేదెలను రెండు వ్యాన్లతో తరలిస్తుండగా పట్టుకుని, వ్యాన్లను సీజ్ చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. గేదెలను వ్యాన్లలో తీసుకువెళుతుండగా సుభద్రాపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తాం

పలాస, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టిట్కో గృహాలు లబ్ధిదారులకు తొందరలోనే అందిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో పలువురు టిట్కో గృహాలు అందించాలని కోరడంతో ఆయన స్పందించారు. 912 గృహాల్లో ఇప్పటికే 706 రిజిస్ట్రేషన్ చేశామన్నారు. మిగిలిన 206 గృహాలు కూడా రిజిస్ట్రేషన్లు చేయించి మొత్తం లబ్ధిదారులకు అందిస్తామన్నారు. బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు మెప్మా సిబ్బంది సహకారంలో చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.